

# డాక్టర్‌గారి భార్య

## – కొమ్మూరి వేణుగోపాలరావు



(గత సంచిక తరువాయి)

**ఓ రాత్రి తొమ్మిదయింది.**

చాలావరకూ ఓ.పి అయిపోయింది.

ఉన్నట్టుండి ఏదో తేడా. తెలియటంలేదు. కొంచెం ఆలోచిస్తే ఒంటికి పడని వాసనలాంటిది వాతావరణాన్ని ఆవహిస్తున్నట్లు బోధపడింది. బయట రోడ్డుమీద ఏదో కలకలం. జనం అటూ ఇటూ పరుగులు తీస్తున్నట్లు దుకాణాల షట్టర్స్ దింపివేస్తున్నట్లు...

కన్సల్టేషన్ రూములో ఓ పేషెంటుని ఎగ్జామిన్ చేస్తున్నాడు. చాలా రఫ్‌గా తలుపులు తోసుకుని లోపలకు వచ్చాడు ఓ యువకుడు.

కొంచెం కోపంగా గుమ్మం కేసి చూశాడు. 'స్టాఫ్ ఏం చేస్తున్నారు?' ఒక కేసు చూస్తున్నప్పుడు...

కాని అతన్ని చూడగానే కోపం చల్లారిపోయింది. మనిషి ఎగరొప్పుతున్నాడు. వళ్ళంతా చెమటలు దిగజారిపోతున్నాయి.

"చచ్చిపోతున్నాను రక్షించండి – రక్షించండి" అని అరిచాడు జాలిగా.

చూస్తున్న పేషెంట్‌ని వదిలిపెట్టి, అతన్ని గబగబా ఎటెండయాడు. పల్స్‌కూడా బాగా ఫీబుల్‌గా వుంది.

"ఏం జరిగింది?" అనడిగాడు.

"ఈ ప్రక్కనే వున్న ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసులో గ్యాస్ సిలిండర్ లీకయింది. అమోనియా చుట్టేస్తోంది నలువైపులా. నాకు ఊపిరి ఆడటంలేదు. గుండెంతా మంటలు. భరించలేకపోతున్నాను తొందరగా ఏదో చేసెయ్యండి."

వెంటనే సిస్టర్ని పిలిచాడు. ఇంట్రోవీనస్‌గా డెకడ్రాన్, ఎమినోఫిలిన్, యాంటీహిస్టమిన్ ఇంజక్షన్లు చేసేశాడు. అతను చాలా ఆరాటపడుతున్నాడు. లేస్తున్నాడు కూర్చుంటున్నాడు. అటూ ఇటూ తిరుగుతున్నాడు.

ఒకచోట కుదురుగా ఉండలేకపోతున్నాడు.

"చాలామందిని చుట్టేసి వుంటుంది. అయిదారుగురు పడిపోవటం నా కళ్ళారా చూశాను. చాలామంది చచ్చిపోయి వుంటారు. అబ్బా! మంటలు. మంటలు."

అతన్ని పట్టుకుని కూర్చోబెట్టి ఆక్సిజన్ పెట్టాడు.

ఇహ అక్కడ్నుంచి మొదలయింది జనప్రవాహం. గ్యాస్ వాసన ఎక్కువయినట్లు తెలుస్తోంది. ఒక్కొక్కళ్ళనీ మూటలు మోసుకొస్తున్నట్లు మోసుకొస్తున్నారు గ్యాస్ ఎఫెక్టు తట్టుకున్నవాళ్ళు.

ఒకరు...ఇద్దరు..ముగ్గురు..నలుగురు.. తర్వాత బెడ్స్ చాల్లేదు. కొంతమందిని పేషెంట్లు కూర్చునే బల్లలమీద, కొంతమందిని నేలమీద పడుకోపెట్టేశారు. ఈ తాకిడికి అప్పటికి మిగిలివున్న అవుట్ పేషెంట్లంతా పారిపోయారు.

ఏడుపులు, కేకలు, పెడబొబ్బలు, ఆర్తనాదాలు.

"నాకు ముందివ్వండి మందు. నన్ను బ్రతికించండి. నన్ను రక్షించండి."

ఊపిరాడక క్రిందపడి దొర్లుతున్నారు .గుండెలనిండా మంటలతో పెడబొబ్బలు పెడుతున్నారు.

యమర్జన్సీ యినక్షన్లు ఎంతమంది కొస్తాయి? అయిదారుగురికి చేసేసరికి అయిపోయాయి.

పేషెంట్స్ తాలూకు మనుషులకి రాసి యిస్తున్నాడు. కాని వాళ్ళంత త్వరత్వరగా తేలేకపోతున్నారు. ఎందుకంటే దగ్గర్లో వున్న షాపులన్నీ మూసివేసి పారిపోయారు. ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుకు మరీ దగ్గర్లో వున్న ఇద్దరు ముగ్గురు డాక్టర్లు కూడా, ఆ సఫకేషన్ భరించలేక హాస్పటల్స్ మూసేసి వెళ్ళిపోయారు. రోడ్డంతా నిర్మానుష్యమైపోయింది.

స్టాఫ్‌ని అటూ యిటూ పరుగులెత్తిస్తున్నాడు నరేష్. ఏ కేసు అర్జంటో గమనించి ఒకరికి తెచ్చిన యింజక్షన్లు ఒకరికి వాడేస్తున్నాడు.

"అయ్యో! అవి మావండీ" అనే కేకల్ని  లక్ష్యపెట్టకుండా ఆక్సిజన్ ఎప్పుడో అయిపోయింది. బ్రతికితే యింజక్షన్లవల్లే బ్రతకాలి. ఇలాంటి సందర్భాలలో చాలా గుండె నిబ్బరం కావాలి, ఆత్మ విశ్వాసం కావాలి – శ్రద్ధ కావాలి.

సలహా చెప్పటానికి ఎవరూ వుండరు. ఒకరు యిరవయ్యేళ్ళ యువతయితే – యింకొకరు డెబ్బయ్ ఏళ్ళ ముదుసలి. వేరొకరు పదేళ్ళ పసికందు.

అందులో యిదివరకే ఆస్తమా ట్రబులున్నవారు ఇద్దరు ముగ్గురు ఉన్నారు. వాళ్ళ పరిస్థితి మరీ సీరియస్‌గా వుంది.

వాళ్ళకి డ్రిప్ స్టార్ట్ చేసి – అందులో కార్టిజోన్, ఎమినోఫిలిన్ కలిపాడు.

ఆ హడావిడిలో ఇంకో కేసు వచ్చింది.

ఆనాడు పాయిజన్ తీసుకున్న అమ్మాయిని, ఆమె తండ్రీ, అలనాటి యువకుడూ మోసుకొచ్చారు.

"సీరీయస్ గా వుంది ఎక్కడైనా పడుకోబెట్టాలి" అంటూ అటూ ఇటూ చూస్తూ "ఎక్కడా బెడ్ ఖాళీలేదేమిటి? పడుకోబెట్టాలి" అన్నాడు తండ్రి.

"బెడ్స్ ఖాళీ లేవు. సారీ క్రిందనే పడుకోపెట్టాలి" అన్నాడు నరేష్.

"ఎవరినన్నా క్రిందపడుకోపెట్టి బెడ్ ఖాళీచేసి ఇవ్వండి."

"సారీ! ఆ పని చెయ్యలేను."

అతను సంకోచిస్తూ అటూ ఇటూ చూడటం చూసి, "మీకు అభ్యంతరమైతే వేరే హాస్పటల్‌కి ఎక్కడికైనా తీసుకెళ్ళండి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇక్కడ అంతకంటే ఫెసిలిటీలేదు" అన్నాడు నరేష్ అంత టెన్షన్‌లోనూ మృదువుగానే.

"నా కారు చెడిపోయింది. ఈ వీధిలో రిక్షాలుగానీ, ఇంకా ఏ వెహికల్‌గాని దొరికేటట్లు లేదు. సరే కానివ్వండి" అంటూ అయిష్టంగానే క్రింద కటికనేలమీద పడుకోబెట్టాడు.

ఎగ్జామిన్ చేశాడు.

ఎమోనియా గ్యాసు పీల్చిన కేసే. ఆయాసం ఎక్కువగా వుంది. ఏ మాత్రమో తెలివుంది.

గబగబా చెయ్యవలసిన ఇంజక్షన్లు చేసేశాడు.

రాత్రి ఒంటిగంటవరకూ ఆ కేసులతో అలా సతమతమవుతూనే ఉన్నాడు.

మొత్తం మీద కేసులన్నీ గండం గడిచి గట్టెక్కాయి. కాని కదల్లేని మెదల్లేని స్థితిలో అలా శవాల్లా పడివున్నారు.

మిగతా స్టాఫ్‌ని ఇంటికి పంపించేశాడు. అంజన ఒక్కతే మిగిలింది. నైట్ డ్యూటీ కాబట్టి.

ఇద్దరూ బాగా అలిసిపోయారు.

అంజనకు కూడా గ్యాస్ ప్రభావం వల్ల గుండె చిక్కబట్టినట్లయి, తల తిరుగుతోంది. అయినా పేషెంట్స్‌కోసం, కర్తవ్య నిర్వహణ కోసం అతి ప్రయత్నం మీద నిగ్రహించుకుంటోంది. వీలయితే ఒక్క అరగంట విశ్రాంతి తీసుకోవాలని ఉంది.

"అంజనా! ఒక్కదానివే చూసుకోగలవా? సాయం వుండనా?" అన్నాడు జాలిగా.

"ఫర్వాలేదు, మీరు వెళ్ళిరండి. చాలా అలసిపోయారు. కేసులు బాగానే వున్నాయి కదా – అవసరమయితే ఫోన్ చేస్తాను" అంది అంజన.

బయటకు వచ్చి – ఆ అర్ధరాత్రివేళ చీకట్లో ఒంటరిగా నడుస్తున్నాడు.

అతనికి నవ్వొచ్చింది ప్రాక్టీస్ పెట్టి ఇన్నాళ్ళయింది .వెహికిల్ కనీసం స్కూటరైనా కొనుక్కోలేకపోయాడు.

అతని బ్యాంక్ బ్యాలెన్స్ ఎప్పుడూ అయిదొందలకు మించి వుండదు...

ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ దగ్గర పోలీసులు కాపలా వున్నారు.

అక్కడ పనిచేసేవారూ, రోడ్డుమీద నడిచేవాళ్ళూ, చుట్టుప్రక్కల ఇళ్ళలోని వారూ చాలామందికి గ్యాస్ సోకి ప్రమాదానికి గురయినారు. ఎక్కువమందిని గవర్నమెంట్ హాస్పటల్‌కి తరలించారు. కొంతమంది చనిపోయి వుండవచ్చు.

ఇంటికి వెళ్ళేసరికి సహజ అతనికోసం ఎదురు చూస్తూ కూర్చుంది. బాబు నిద్రపోతున్నాడు.

"ముందు వేడి వేడి నీళ్ళు స్నానం చెయ్యండి. మీ వొళ్ళెలా అలసిపోయి వుంటుందో నాకు తెలుసు" అన్నది సహజ నవ్వి.

పదకొండు తర్వాత ఆమె ఫోన్ చేసినప్పుడు జరిగిందంతా అంజన చెప్పింది.

అతను స్నానానికి కూర్చున్నాక "ఉండండి తల స్నానం చేసేద్దురుగాని" అంటూ కుంకుడుకాయ రసం తీసుకొచ్చింది.

అర్ధరాత్రి –వేన్నీళ్ళ స్నానం, అందులో సహజ తల రుద్దటం గొప్ప రిలీఫ్ ఇచ్చింది.

మరునాడు ఉదయం పేపరు చూసేసరికి రాత్రి జరిగిన గ్యాస్ లీక్ ప్రమాదంలో పదిమందిదాకా మరణించారని తెలిసింది.

ఎక్కువమంది గవర్నమెంట్ హాస్పటల్లో పోయారు.

క్లినిక్‌కు వెళ్ళేసరికి ఇన్ పేషెంట్సందరూ లేచి కూర్చుని వున్నారు. వాళ్ళ ముఖాలు కొంతవరకూ ఉల్లాసంగానే ఉన్నాయి. డాక్టరుగారు ఎప్పుడు వస్తారా చెప్పి వెళ్ళిపోదామా అని ఆతృతగా వున్నారు.

ఒక్కొక్కర్నీ కన్సల్టింగ్ రూములోకి పిలిచి, ఎగ్జామిన్ చేసి పంపించేస్తున్నాడు.

పాయిజన్ మ్రింగిన అమ్మాయి లోపలకు వచ్చింది.

"అన్నట్లు మీ పేరేమిటి?" అన్నాడు.

రేఖ అని చెప్పి "థాంక్స్ ఇంకోసారి కూడా నా జీవితాన్ని పొడిగించారు" అన్నది.

అతను నవ్వి ఊరుకున్నాడు.

"మా ఇంటికి దగ్గర్లోనే వుంది ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసు. గ్యాస్ లీకవటం, జనం కకావికలై పరిగెత్తుతూ వుండటం, కొంతమంది పడిపోతూ వుండటం డాబామీద నుంచి చూస్తూనే వున్నాను. కావాలంటే ఇంట్లో ఎ/సి రూం వుంది లోపలకు వెళ్ళి అందులో వుంటే తప్పించుకోవచ్చు. కాని అలా చేయలేదు. గ్యాస్ నావైపు కూడా వచ్చింది. కదలకుండా అలాగే నిలబడ్డాను. ఆయాసమొచ్చింది. కళ్ళు తిరిగాయి. తరవాతేం జరిగిందీ తెలీలేదు?"

"ఎందుకు మీ కంత కసి?"

నవ్వింది – ముత్యాలవంటి పలువరస తళుక్కుమని మెరిసింది.

"ఒకటయితే పర్వాలేదు. రెండు మూడు వున్నాయి."

"ఏమిటవి?"

"చెప్పను."

"ఎందుకని?"

"కొన్ని కొన్ని శరీరంలోనే పుట్టి శరీరంతోనే నశించిపోవాలి."

"మీ ఇష్టం."

ఇంతలో ఆమె తండ్రి వచ్చాడు యాంత్రికంగా కృతజ్ఞతలు చెప్పి ఫీజు చెల్లించి కూతుర్ని తీసుకుని వెళ్ళిపోయాడు.

టేబుల్ మీద ఫోన్ మ్రోగింది.

రిసీవర్ అందుకున్నాడు.

"హల్లో! నేను గోవర్ధనరావునండీ, ఒకసారి మీరు అర్జంటుగా రావాలి."

"ఏమిటి?"

"చాలా సీరీయస్‌గా వుంది."

"ఎవరికి?"

"నాకే"

ఈ మధ్య బిజీగావుండటం వల్ల ప్రతిరోజూ కాకపోయినా నాలుగయిదు రోజులకోసారయినా వెళ్ళి ఆయన్ని చెకప్ చేసి వస్తూనే వున్నాడు.

రాత్రి గ్యాస్ ప్రమాదాన్ని ఆయనెలా తట్టుకున్నాడు? ఎందుకైనా మంచిదని ఆదరా బాదరాగా వెళ్ళాడు. రోడ్డుదాటి వెళ్ళటమే కదా.

గోవర్ధన్‌రావుగారు మంచం మీద దిగులుగా పడుకుని వున్నాడు.

"రండి డాక్టరుగారూ! గబగబా చెకప్ చెయ్యండి" అన్నాడు చాలా ఆదుర్దాగా.

"ఏం జరిగింది?"

"ఇందాకనే లేచి పేపరు చూస్తున్నాను. దగ్గర్లో ఎక్కడో గ్యాస్ లీకయి పదిమందిదాకా చనిపోయినట్లు వుంది. ఈ గ్యాసు నేను పీల్చే వుంటాను. లోపల ఏదో జరిగే వుంటుంది. త్వరగా ఏదో ఒకటి చేసెయ్యండి – లేకపోతే చచ్చిపోతాను."

"రాత్రి ఎక్కడున్నారు?"

"ఎ.సి రూములో ఎనిమిది గంటలకే పడుకున్నాను. బయటేం జరిగిందో నాకు తెలియదు."

"హమ్మయ్య!" అని ఊపిరి పీల్చుకున్నాడు.

ఆయనకు బి.పి. అదీ చూసి గుండె, ఊపిరితిత్తులు పరీక్ష చేసి అంతా పకడ్బందీగా వుంది. ఏమీ ప్రమాదం జరగలేదు అని చెప్పేదాకా గోవర్ధనరావుగారు "అమ్మో! అబ్బో!" అని మూలుగుతూనే వున్నాడు.

వేసవి ఎండలు మండిపోతున్నాయి. బయట టెంపరేచర్ నూటపదిహేడు డిగ్రీలు కూడా దాటిపోయింది. వడదెబ్బ కేసులు, సమ్మర్ డయేరియా కేసులు ఒకదాని వెంట ఒకటి విరుచుకుపడుతున్నాయి.

పిల్లలు పిట్టల్లా రాలిపోతున్నారు.

ఒకరోజు హాస్పటల్ చాలా బిజీగా వుంది. ఏడుపులు, మూలుగుల, నిస్సహాయస్థితిలో పడివుండటాలు.

అందులో ఆ పూట ఓ కాంపౌండర్ రాలేదు. ఇంటి దగ్గర్నుండి ఫోన్ వచ్చింది.

"బాబుకి జ్వరమొచ్చింది" అన్నది సహజ.

"ఎంత వుంది?"

"నూట నాలుగు."

గుండెలు కళుక్కుమన్నట్లయి తమాయించుకున్నాడు.

"పేరాసిటమాల్ పట్టకపోయావా?"

"పట్టాను."

"తలకి ఐస్ పెట్టు. వొళ్ళంతా స్పాంజ్ బాత్ చేయించు. అసలు పల్చని తడిగుడ్డ కప్పేసి వుంచు. తియ్యవద్దు" అంటూ కడుపులోకి ఏమేమి ఇవ్వాలో చెప్పాడు. కొబ్బరి బొండాల నీళ్ళు, ఎలక్ట్రోలైట్ వాటర్... అరగంటకోసారి జ్వరం చూస్తూ వుండు" అని ఫోన్ పెట్టేశాడు.

పరీక్ష పెట్టినట్లు రోజూకన్నా ఆ వేళ జనం ఎక్కువగా వచ్చారు. ఇంచుమించు అన్నీ పిల్లల కేసులే.

ఎక్కువభాగం సీరియస్‌గా వున్నాయి.

విపరీతంగా ఆరాటపడుతున్నారు. కొంతమంది టాక్సిక్‌గా వున్నారు.

కొంతమందికి కన్వల్షన్స్ వస్తున్నాయి.

ఒక కేసు ఎటెండ్ అవుతుంటే రెండవవాడు వచ్చి "మా కేసు చూడండి" అంటూ ప్రాణం తోడేస్తున్నారు.

కొంతమందికి సెలైన్ పెట్టవల్సి వస్తోంది.

అలాగే వీలు చూసుకుని ఓ గంట తర్వాత యింటికి ఫోన్ చేశాడు.

"బాబుకి ఎలా వుంది?"

"అలాగే వుంది."

"టెంపరేచర్ తగ్గలేదా?"

"తగ్గి మళ్ళీ వస్తోంది."

"జాగ్రత్తగా చూస్తూ వుండు."

"ఫర్వాలేదు లెండి. అక్కడ చాలా బిజీగా వున్నారా?"

"చాలా"

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"సహజా! కోపం వస్తోందా?"

"దేనికి?"

"బాబుని చూడ్డానికి వెంటనే రాలేకపోతున్నానని."

"కుదరకపోతే ఎలా వస్తారు? మనమీద ఆశపెట్టుకుని వచ్చిన వాళ్ళంతా మనబాబులా మీ వాళ్ళు కాదా?"

"యు ఆర్ గ్రేట్ సహజా!" అనుకున్నాడు. కాని అతనికి లోపల చాలా దుఃఖంగా వుంది.

"ఏమిటి మీరు మాట్లాడటంలేదు?"

"...ఏమీలేదు"

"బాధపడకండి. మీరు ధైర్యంగా లేకపోతే మిగతా కేసులకి జస్టిస్ చెయ్యలేరు" అన్నది సహజ.

అతనేమీ మాట్లాడలేదు.

"ఏమిటి మాట్లాడరు?

"ఊఁ"

"ధైర్యంగా వుండండి."

"...పెట్టేస్తున్నాను"

మరో గంటన్నర గడిచేసరికి హాస్పటల్ పని ఓ మోస్తరుగా పూర్తయింది.

"ఇంటికి వెళ్ళి మళ్ళీ సాధ్యమైనంత తొందరగా వచ్చేస్తాను" అని స్టాఫ్‌కి చెప్పి నరేష్ బయల్దేరబోతున్నాడు. హోరున కొడుతున్న వడగాలికి చాలా నిస్త్రాణగా ఉంది.

ఫోన్ మ్రోగింది.

ఇంటి దగ్గర్నుంచేమో అనుకుంటూ – రిసీవ్ చేసుకున్నాడు.

విష్ణుమూర్తి.

"హలో! ఒకసారి ఇంటికి రాగల్రా?"

"ఏమిటి?"

"మా అబ్బాయికి సన్‌స్ట్రోక్ కొట్టినట్లుంది. టెంపరేచర్ నూట ఆరు డిగ్రీలుంది. ఎందుకో భయంగా ఉంది."

నరేష్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కాకపోయినా పిల్లల కేసులు బాగా చూస్తాడని విష్ణుమూర్తిగా బాగా గురి. తన దగ్గరకొచ్చే పిల్లల మెడికల్ కేసులు నరేష్‌కే రిఫర్ చేస్తూ ఉంటాడు.

"వస్తున్నాను" అని ఫోన్ పెట్టేసి బాయ్టకు వచ్చాడు.

విష్ణుమూర్తి జీవితంలో ఇటీవల ఓ విషాదం ఏర్పడింది.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

COMMENTS